క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కొత్తకోట రూరల్: మండలంలోని మిరాసిపల్లి కాంప్లెక్స్ పరిధిలోని పీఎస్, యూపీఎస్ పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుల సహకారంతో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డికి డెల్ కంపెనీకి చెందిన కంప్యూటర్‌ను అందజేశారు. ఈ కంప్యూటర్ ద్వారా టీచర్లకు సంబంధించిన నెలవారి వేతన, సప్లమెంటరీ బిల్లులు, డీఏ బిల్లులు, అన్ని ఎస్టీఓ బిల్లులు చేయడానికి ఉపయోగకరంగా ఉంటుందని హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అనంతరం కంప్యూటర్‌కు పూజ చేసి ప్రారంభించారు. భవిష్యత్‌లో పాఠశాలకు మరిన్ని ప్రోత్సాహకర వస్తువులు అందించి కాంప్లెక్స్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్యనారాయణ, అరవింద్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు గురువారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు డా.తారాశశాంక్ ఆధ్వర్యంలో ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఐరన్ లోపంతో వచ్చే రక్తహీనత(అనీమియా), పౌష్టికాహారం, కూరగాయాలు, ఆకుకూరలపై అవగాహన కల్పించారు.

25 నుంచి కొత్తకోట మండల ప్రీమియర్ లీగ్



కొత్తకోట రూరల్: కొత్తకోట మండలం ప్రీమియర్ లీగ్ తరఫున నిర్వహించనున్న క్రికెట్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా నిర్వాహకులు న్యాయవాది మునగారి కృష్ణ, కరాటే శివయాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట, మదనాపురం, అడ్డాకుల, భూత్పూర్, చిన్నచింతకుంట (సీసీ కుంట), మూసాపేట మండలాలకు చెందిన జట్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల 25న టోర్నమెంట్ ప్రారంభిస్తామని, ఈనెల 8 నుంచి ఆసక్తి గల జట్ల కెప్టెన్లు తమ వివరాలను నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50వేలు నగదుతో పాటు షీల్డులను అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99893 30391 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటాలి



అమరచింత: విద్యార్థులు క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్, మాజీ సర్పంచ్ చుక్క చిన్నఆశిరెడ్డి అన్నారు. మండలంలోని ఈర్లదిన్నె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు స్పోర్ట్స్ గ్రాంట్స్ ద్వారా వచ్చిన క్రీడా సామగ్రిని గురువారం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శారీరక, మానసిక దృఢత్వం పెంచుకోవాలని సూచించారు. స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రూ.5వేల నగదు, క్రీడా దుస్తులకు రూ.5 వేలు మాజీ సర్పంచ్ ఆశిరెడ్డి అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిరాజుద్దీన్, వెంకటరాములు, మధు, బాలస్వామి, నాగరాజు, నీరజ, కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

కోడేరు: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు యూరియా అందుబాటు లో ఉందని సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, సీఈఓ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బస్తా ధర రూ.270లు ఉంటుందని, కావల్సిన రైతులు పట్టాదారు పాసుబు క్కు, ఆధార్‌కార్డు జిరాక్స్ తేవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధుల్లో అలసత్వం సరికాదు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి
- ఉపాధి పని ప్రదేశంలో వసతులు తప్పనిసరి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులు వేగంగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఉపాధి హామీ పనులు, బ్యాంకు లింకేజీ రుణాల అంశాలపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలతో మండలాల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపికై మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ భవనాల వద్ద సమావేశాలు నిర్వహించి, ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించడానికి లబ్ధిదారులకు ఏమైనా ఆర్థిక సమస్యలు ఉంటే స్వయం సహాయక మహిళా బందాల ద్వారా ఏదైనా రుణం ఇప్పించేందుకు సహకరించాలని సూచించారు. అన్ని మండల కేంద్రాల్లో వేగంగా నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇంకా ప్రారంభానికి నోచుకోని మండలాల్లో స్థలాలు గుర్తించి, అప్పగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. రాబోయే రెండు మూడు రోజుల్లో అధిక సంఖ్యలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశారు.

వసతులు కల్పించాలి

ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలు పని చేసే ప్రదేశాల్లో వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎండలు ముదురుతున్న తరుణంలో పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం, నీడ ఏర్పాట్లు, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా జిల్లాలో లేబర్ మొబిలైజేషన్ పెంచాలన్నారు. కొత్తగా ఏవైనా పనులను గుర్తించి మ్యాన్ డేస్ లక్ష్యం పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలకు సంబంధించి సర్వైవల్ రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. ఇక మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబంధించి బ్యాంకు లింకేజీ రుణాల విషయంపై పెండింగ్ లక్ష్యాన్ని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్, గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్వతాలు, విఠోబా, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

- యువతను కాపాడుదాం
- సేవ్ యూత్.. సేవ్ వనపర్తి
- ఎస్పీ రావుల గిరిధర్



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

పెబ్బేరు రూరల్: మున్సిపాలిటీ కేంద్రంలోని సుభాష్‌చౌరస్తాలో గురువారం సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, ప్రమాదకర డ్రైవింగ్‌పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, సైబర్ స్టాకింగ్, వర్క్ ఫ్రం హోం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించి అందినకాడికి దండుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోయినట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. నేటి సమాజంలో ఇంటర్నెట్ వినియోగం పెరిగిందని, వాటిపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

బెట్టింగ్ యాప్స్‌తో జాగ్రత్త

సోషల్ మీడియాను సరైన పద్ధతిలో వాడాలని, అందులో వ్యక్తిగత సమాచారాన్ని పెట్టకూడదని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు బెట్టింగ్‌కు సంబంధించిన యాప్‌లకు చాలా దూరంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు మొదట డబ్బు ఆశ చూపి మొబైల్‌లో ఉన్న డాటాను తస్కరించి బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బులు కాజేస్తారని వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యువత, విద్యార్థులు డ్రగ్స్, మద్యానికి బానిస కాకుండా ఉన్నత లక్ష్యాలు నిర్ధేశించుకోవాలని సూచించారు. ఎవరైనా గంజాయి తాగుతున్నట్లు, అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. రోడ్డుపై వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ఎంఈఓ జయరాములు, కౌన్సిల్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గ్రామాల్లో సర్వే



సమస్యలపై మాట్లాడుతున్న నాయకులు

అమరచింత: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సర్వే చేపడుతున్నామని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ తెలిపారు. మార్చి చివరి నాటికి సమస్యలపై సర్వే నిర్వస్తామన్నారు. మండలంలోని ధర్మాపురం కాలనీల్లో గురువారం తిరుగుతూ సమస్యలు గుర్తించామన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుందని, సీసీ రోడ్ల సమస్య వేధిస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో డ్రైయినేజీల నిర్మాణాలు లేకపోవడంతో మురుగు రహదారులపై పారుతుందన్నారు. సాగునీరు లేక వ్యవసాయ భూములను బీడుగా వదిలేస్తున్నారని, ఎత్తిపోతల పథకం చేపట్టి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఏడో తరగతి వరకే పాఠశాల ఉండటంతో ఉన్నత చదువులతో పాటు ఇతర గ్రామాలకు ప్రజలు వెళ్లాలంటే రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మన్యం, బాలకృష్ణ, శంకర్, మోహన్, మహేష్, అశోక్, రాజు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల గెలుపు సంబురాలు



పెబ్బేరులో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



ఆత్మకూర్‌లో తపస్ నాయకులు

అమరచింత: రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందడంపై పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సంబురాలు నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీ గాలి మొదలైందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని జోస్యం చెప్పారు. అనంతరం బాణాసంచా కాల్చుతూ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, నరాల నారాయణ, రాకేష్‌శెట్టి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో పట్టణంలోని సుభాష్‌చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకొని బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో..

ఆత్మకూర్: ఎమ్మెల్సీ స్థానాల్లో మల్క కొమరయ్య, అంజిరెడ్డి గెలుపుపై ఆత్మకూర్, అమరచింత తపస్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆత్మకూర్ ఎంఈఓ బాలరాజు, అమరచింత ఎంఈఓ భాస్కర్‌సింగ్ ఉపాధ్యాయులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఒగ్గు ఉమాశంకర్, నారాయణ, కృష్ణయ్య, ఒగ్గు రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మల్లేష్, రామన్‌గౌడ్, శాంతన్న, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కొత్తకోట రూరల్: ఇంటర్ పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా కొనసాగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 183మంది విద్యార్థులకు గానూ 179మంది, ప్రతిభ జూనియర్ కళాశాలలో 214మంది విద్యార్థులకు గానూ 207మంది విద్యార్థులు, నివేదిత జూనియర్ కళాశాలలో 218మంది విద్యార్థులకు గానూ 211మంది పరీక్షలు రాశారని అధికారులు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను సూపరింటెండెంట్లు రాజు, కృష్ణవేణి, గోపాల్ నిరంతరం పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ లావణ్య మూడు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షకు 107 మందికి గానూ ఒక్కరు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సుదర్శన్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సిటింగ్ స్క్వాడ్ నవీన్‌కుమార్ పరీక్ష పూర్తయ్యేవరకు పరీక్ష కేంద్రంలోనే ఉండి పరీక్షను పర్యవేక్షించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఆత్మకూర్: పట్టణంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో తిప్పడంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ వసంత గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందించారు. క్రమం తప్పకుండ పౌష్టికాహారం తీసుకోవాలని, సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ బెనర్జీ, ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి, ఆశకార్యకర్తలు, విద్యార్థులు ఉన్నారు.

కళాకారుల పింఛన్ ఇప్పించాలని విజ్ఞప్తి

వీపనగండ్ల: వృద్ధ కళాకారులకు 4 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పింఛన్ డబ్బుల రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మండల కేంద్రానికి చెందిన నాగస్వర కళాకారుడు మంగళి నారాయణ వాపోయారు. పింఛన్ డబ్బుల కోసం ప్రభుత్వ అధికారులు దగ్గరకు వెళితే తమకు తెలియదని సమాధానం ఇస్తున్నారని వాపోయారు. కనీసం ఉగాది పండుగ నాటికైనా తమకు పింఛన్ డబ్బులు ఇప్పించాలని ఆయన ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల సమీపంలో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని సింగోటం గ్రామానికి చెందిన విజేయుడు గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ వస్తున్న ఆర్టీసీ బస్సు పీజీ కళాశాల సమీపంలో ద్విచక్ర వాహనంపై కొల్లాపూర్ నుంచి సింగోటం వెళ్తున్న విజేయుడును ఢీ కొట్టింది. దీంతో ఆయన తలకు గాయమైంది. అటుగా వెళ్తున్న ప్రజావికాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కలమంద శేఖర్ గాయపడ్డ విజేయుడును అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అపార్ ఐడీ నమోదుపై సమీక్ష

కొల్లాపూర్: అపార్ ఐడీ నమోదుపై గురువారం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ బాలిక ల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పా ఠ శాలల హెచ్ఎంలతో జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ షర్ఫొద్దీన్, ఎంఈఓ ఇమ్మాను యేల్ సమావేశమయ్యారు. అపార్ ఐడీ నమోదు వివరాలు తెలుసుకున్నారు. త ప్పనిసరిగా నిర్ణీత గడువులోగా అపార్ ఐడీ నమోదు చేయాలని సూచించారు. ఐడీలు నమోదు చేయకుంటే ఆయా పా ఠశాలల హెచ్ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పెద్దకొత్తపల్లి: కల్వకోల్ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చెన్నకేశవ స్వామి గుడి వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ నీరు వదిలితే సమస్య పరిష్కారం అవుతుందని సీపీఎం మండల కార్యదర్శి దశరథం అన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అధ్యయనం చేశారు.

నేడు సెమినార్

పెంట్లవెల్లి: 'మనువాదం-దళిత మహిళా హక్కుల'పై సెమినార్‌ను శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌కు ముఖ్యఅతిథిగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కందికొండ గీత హాజరవుతారని తెలిపారు. సెమినార్‌కు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులు!

- ఉపాధ్యాయులపై చర్యలకు డిమాండ్
- ఎంఈఓకు బాలికలు, ఏబీవీపీ నాయకుల ఫిర్యాదు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి బాలికలతో కొందరు ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తూ, చెడు మాటలు మాట్లాడారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఆయా తరగతి బాలికలు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఆయా ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ విద్యార్థి నాయకులు ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు చెందిన చిన్ననాగన్న, రఘురాం అనే ఉపాధ్యాయులు అసభ్యకరంగా మాట్లాడటం, వేధించడం వంటి చేష్టలతో ఇబ్బందులకు చేస్తున్నారని బాలికలు రాతపూర్వకంగా ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి సంఘం నాయకులు, బాలికల కుటుంబ సభ్యులు ఈ విషయంపై ఎంఈఓతో చర్చించి వారిపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాల బాలికలు, విద్యార్థి సంఘం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలికలతో విడివిడిగా వివరాలు సేకరించి, వారి నుంచి రాతపూర్వకంగా మరోసారి విచారణ, ఆయా ఉపాధ్యాయుల, హెచ్ఎం వివరణ తీసుకొని పూర్తి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేస్తామన్నారు. ఆ నివేదిక ఆధారంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

సాగునీరు అడిగితే కేసులా?

- రైతులపై కేసులను భేషరత్‌గా రద్దు చేయాలి
- ఎండిన పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బీరం



ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: కాల్వల ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడాలని రైతులు రాస్తారోకో చేస్తే పోలీసులు పక్షపాతం చూపుతూ కొందరిపై కేసులు పెట్టి.. నోటీసులు ఇవ్వడం ఏమిటని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం పాన్‌గల్ మండలంలోని అన్నారంతండా, గోప్లాపూర్ శివారులో ఎండిన పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేఎల్ఐ డీ 8 ఎంజే-4 మైనర్ కాల్వలను తవ్వకపోవడంతో అన్నారం, అన్నారం తండాకు సాగునీరు అందని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. అర కిలోమీటర్ కాల్వ తవ్వితే వందల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల భూములకు నష్టం కలుగుతుందనే ఉద్దేశంతో కాల్వను తవ్వడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. సాగునీరు అందక పంటలు ఎండుతున్నా అధికారుల పార్టీ నాయకుల్లో చలనం లేదని దుయ్యబట్టారు.

ఇచ్చిన మాట తప్పారు

గత నెల17వ తేదీన సాగునీటి కోసం ఆయా గ్రామాల రైతులు రాస్తారోకో చేస్తే అధికారులు స్పందించి పది రోజుల్లో కాల్వను తవ్వి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చినా.. అమలు కాలేదన్నారు. వందల ఎకరాల్లో వరి, వేరుశనగ పంటలు ఎండుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు రాస్తారోకో చేస్తే సాగునీరు ఇస్తామన్నా అధికారులు సాగునీరు ఇవ్వకపోగా రైతులపై కేసులు పెట్టి నోటీసులు ఇచ్చారన్నారు. అందులో అందరి రైతులపై కాక బీఆర్ఎస్, బీజేపీల సానుభూతిపరులపై పక్షపాతంతో పోలీసులు కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేసి కాల్వ తవ్వి సాగునీరు అందించి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఎస్పీతో మాట్లాడుతానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, వీరసాగర్, రాములు, బాలస్వామి, కృష్ణయ్యగౌడ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాంబాబు, భాస్కర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, రమేష్‌నాయక్, నవీన్‌కుమార్‌రెడ్డి, నర్సింహ రైతులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అడ్డా చూపించాలి



వీధి వ్యాపారులతో కలిసి పాలిటెక్నిక్ కళాశాల కాంపౌండ్ వద్ద నిరసన చేస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: పట్టణంలోని పాలిటెక్నిక్ కాంపౌండ్ వద్ద గతంలో డబ్బాలు వేసుకొని వీధి వ్యాపారం చేసుకొని జీవనం గడుపుతున్న పేదలకు అడ్డా చూపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అధికారులను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని వీధి వ్యాపారులతో కలిసి పాలిటెక్నిక్ కాంపౌండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి కాంపౌండ్‌కు ఆనుకొని డబ్బాలలో వ్యాపారం చేసుకుంటూ జీవనం గడుపుతున్న వారికి రోడ్డు విస్తరణ పనుల కారణంగా ఉపాధి పోయిందని వాపోయారు. రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న సమయంలో మూడు నెలల్లోనే మున్సిపల్ నుంచి ఎవరి స్థలంలో వారికి డబ్బాలు వేసి ఇస్తామని హామీ ఇచ్చినా.. ఎవరూ అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ చూపి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వీధి వ్యాపారులకు అడ్డా చూపించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షులు బాలేసాబ్, కార్యదర్శి రామస్వామి, నాయకులు వెంకటేశ్వరాచారి, చంద్రుడు, శంకర్, నరేష్, వెంకటస్వామి, మురళి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల నివారణ కోసమే..



ఆలయం తలుపులకు ఇన్విజబుల్ తాళం బిగిస్తున్న ఎస్ఐ

ఖిల్లాఘనపురం: ఆలయాల్లో జరుగుతున్న దొంగతనాలు అరికట్టేందుకు ఇన్విజబుల్ తాళాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. గురువారం ఖిల్లాఘనపురం బజారు ఆంజనేయ స్వామి ఆలయంలో ఇన్విజబుల్ తాళం బిగించిన ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ గిరిధర్‌రావు సూచనల మేరకు మండలంలోని ముఖ్యమైన 63 ఆలయాలకు తాళాలను బిగించామన్నారు. దొంగతనాల నివారణ కోసం మండల ప్రజలు తమ ఇళ్లకు ఇలాంటి తాళాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇన్విజబుల్ తాళాలను ఆలయాలకు బిగించేందుకు సహకారం అందించిన అన్ని గ్రామాల పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈఓగా మేఘనాథ్, హెచ్ఎంగా హిమవతి, మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఎంఈఓ జయశంకర్, కాంప్లెక్స్ హెచ్ఎం కాళీదాస్‌లు హాజరై ఉత్తమ బోధన చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అరుంధతి, ఉపాధ్యాయులు నర్మద, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



'మహిళలు పురుషులతో సమానంగా రాణించాలి'



మాట్లాడుతున్న పుట్టా ఆంజనేయులు

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ మహిళా కమ్యూనిటీ భవనంలో సీపీఎం జిల్లా నాయకురాలు సాయిలీల అధ్యక్షతన గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ.. మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రమ దోపిడి, హక్కుల అణిచివేతకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం అన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ, కవిత, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.